దళితుల అభ్యున్నతికి కృషి

ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): దళితుల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ యాదవరెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన 76 మంది దళిత కుటుంబాలకు జగదేవ్‌పూర్‌లో ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. దళితులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో దళితబంధు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, ఎంపీపీ బాలేషంగౌడ్, వైస్ ఎంపీపీ భగవాన్, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, ఆత్మ చైర్మన్ రంగారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

బస్టాండ్ నిర్మాణ పనుల పరిశీలన

గజ్వేల్: గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణ పనులను రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, కమిషనర్ విద్యాధర్ ఉన్నారు.



జగదేవ్‌పూర్‌లో ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేస్తున్న నాయకులు

బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయం



నియామక పత్రాలు అందిస్తున్న వంశీకృష్ణగౌడ్

దుబ్బాక: వచ్చే ఎన్నికల్లో దుబ్బాకలో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని ఆపార్టీ దుబ్బాక మున్సిపల్ అధ్యక్షుడు పల్లె వంశీకృష్ణగౌడ్, జిల్లా బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు గుండవెల్లి ఎల్లారెడ్డి అన్నారు. శుక్రవారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్ వార్డు 46వ బూత్ అధ్యక్షుడిగా చెరుకు దేవరాజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోషల్ మీడియా ఇన్‌చార్జిగా మద్దికుంట మహేశ్, యువజన విభాగం అధ్యక్షుడిగా కంతి యాదగిరి, మహిళా విభాగం అధ్యక్షురాలిగా పద్మను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. ఈ మేరకు నూతనంగా ఎన్నికైన వారికి నియామకపత్రాలు అందించారు. కార్యక్రమంలో 2వ వార్డు కౌన్సిలర్ దేవలక్ష్మీ సంజీవరెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాజమౌళి పంతులు, భూంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన

సిద్దిపేటరూరల్: నారాయణరావుపేట మండల పరిధిలోని ఇబ్రహీంపూర్ గ్రామ మహిళా రైతులకు వరి నాటు విధానం, పంట యాజమాన్య పద్ధతులపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వ్యవసాయ విస్తరణాధికారి నాగార్జున మాట్లాడుతూ.. మహిళా రైతులు వ్యవసాయంలోని కొన్ని మెలకువలు పాటిస్తే పంటల దిగుబడిని అధికంగా పొందే అవకాశం ఉంటుందన్నారు. సాధారణంగా ఇక్కడి రైతులు వరిలో స్వల్పకాలిక , మధ్యకాలిక రకాలను సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. దీంతో నాటు వేసేటప్పుడు ఒక చదరపు మీటరుకు 30 నుంచి 33 మొక్కలు పెడుతున్నారన్నారు. నారు మడిదశలోనే కలుపు నివారణ మందు పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి కోఆర్డినేటర్ నగేశ్‌రెడ్డి, మహిళా రైతులు, తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం

కొండపాక(గజ్వేల్): మండల కేంద్రమైన కొండపాక నుంచి దమ్మక్కపల్లి మధిర పిట్టలవాడకు రవాణా సౌకర్యం కోసం జెడ్పీ నిధుల నుంచి రూ. 4 లక్షలను జెడ్పీటీసీ అనంతుల అశ్విని మంజూరు చే యించారు. దీంతో శుక్రవారం వార్డు సభ్యులు గుజ రాతి యాదగిరి, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు కూరాటి రమేశ్ బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రారంభించారు.

ట్యాబ్‌ల అందజేత

హుస్నాబాద్: హుస్నాబాద్ మండలం, పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శుక్రవారం మండల వనరుల కేంద్రంలో ఎంఈఓ దేశిరెడ్డి ట్యాబ్‌లు అందజేశారు.

పౌర హక్కుల రక్షణ బాధ్యత అధికారులదే

అక్కన్నపేట(హుస్నాబాద్): ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అతిగొప్ప వరం పౌర హక్కులని.. వాటిని కాపాడి, ప్రతి పౌరుడికి న్యాయం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎంపీటీసీ సభ్యుడు లింగాల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని రామవరంలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజు, ఉప సర్పంచ్ కనకయ్య, వార్డు సభ్యులు భాస్కర్‌నాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన అవసరం

మద్దూరు(హుస్నాబాద్): పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీనియర్ అసిస్టెంట్ యాదగిరి అన్నారు. శుక్రవారం మండలంలోని లక్కపల్లిలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని వీరన్నపేటలో శుక్రవారం రెవెన్యూ, పోలీసుల ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. సర్పంచ్ కొడపాక భిక్షపతి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్, ఏఎస్ఐ నవీన్ పాల్గొని యువతకు రాజ్యాంగంలో కల్పించిన హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్

పాండురంగ ఆశ్రమంలో మహా అన్నదానం



సహపంక్తి భోజనం చేస్తున్న భక్తులు

మర్కూక్(గజ్వేల్): మండలంలోని భవానందాపూర్ పురాతన ఆశ్రమం రుక్మిణి పాండురంగ దేవాలయంలో శుక్రవారం భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు భారీగా హాజరు కాగా దేవాలయం ఎదుట అన్నం రాశులుగా పేర్చి చాటలతో అన్నదానం చేపట్టారు. ఇబ్బందులు రాకుండా ఆలయ సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. చివరి రోజు కావడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. కార్యక్రమంలో పండితులు సత్యనారాయణశర్మ, వెంకటేశ్వరశర్మ, విఠల్‌శర్మ, రఘుపతిశర్మ, శశిధర్‌శర్మ పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి ప్రత్యేక పూజలు

పాండురంగ ఆశ్రమంలో కేంద్ర మత్స్య పశు సంవర్ధక శాఖ మంత్రి పురోషోత్తం రూపాల ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఆయనను సన్మానించారు. ఆయనతో పాటు హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆశ్రమంలో పూజలు చేశారు.

రైతులకు కేంద్రం అండ

సిద్దిపేటజోన్: రైతులకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉందని కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మహిపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా జిల్లాలోని 20 మంది ఆదర్శ రైతులను సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాడని కొనియాడారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు వంగ రామచంద్రారెడ్డి, గుండ్ల జనార్దన్, జిల్లా నాయకులు నరేష్, శ్రీనివాస్, కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

దుబ్బాక: పట్టణంలోని గ్రూప్–4 పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు దుబ్బాక సీఐ మున్నూరు కృష్ణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పరీక్ష కేంద్రాలను దుబ్బాక ఎస్సై మహేందర్, భూంపల్లి ఎస్సై గంగరాజుతో కలిసి పరిశీలించారు.

సంక్షిప్త వార్తలు

◆ పరామర్శ

దుబ్బాకరూరల్: మండలంలోని పోతారం గ్రామానికి చెందిన చాకలి పర్సయ్య ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్ పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, ఆకుల దేవేందర్, బాలకిషన్, ఆశయ్య తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌రూరల్: మండల పరిధిలోని దాచారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఏలేశ్వరం నరేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా కుటుంబ సభ్యులను గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ శుక్రవారం పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ భాగ్యనర్సింలు, మాజీ ఎంపీపీ చిన్న మల్లయ్య, బీఆర్ఎస్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

◆ 'మనోభావాలు దెబ్బతీయడం సరికాదు'

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వివిధ పోటీ పరీక్షల సమయంలో హిందు మహిళల మనోభావాలు దెబ్బతీసే విధంగా తనిఖీలు చేయడం, పుస్తెమెట్టెలు తీయమనడం చెప్పడం సరికాదని విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి గ్యాదరి రాజారాం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

◆ నూతన నియామకం

హుస్నాబాద్: అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ హుస్నాబాద్ మండలం, పట్టణ సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. సంఘం హుస్నాబాద్ మండల అధ్యక్షుడిగా ఏగ్గోజు సుదర్శనాచారి, ఉపాధ్యక్షుడిగా ఉప్పుల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడిగా చెన్నోజు నాగభూషణం, ఉపాధ్యక్షుడిగా కనకయ్యతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

◆ కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ల పంపిణీ

హుస్నాబాద్: పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో శుక్రవారం గర్భిణులకు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లను ఎంపీపీ లకావత్ మానస పంపిణీ చేశారు.

క్లుప్తంగా

'ధర్నాను విజయవంతం చేయాలి'

తొగుట(దుబ్బాక): ఈనెల 10వ తేదీన కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి గొడ్డుబర్ల భాస్కర్ పిలుపునిచ్చారు. శుక్రవారం దుబ్బాక సీడీపీఓ చంద్రకళకు ధర్నాకు అనుమతించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్య సాధన కోసం నిర్వహించే ధర్నాలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొనాలని కోరారు.

మంత్రి చొరవతో అభివృద్ధి



సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న నాయకులు

సిద్దిపేటరూరల్: మంత్రి హరీశ్‌రావు చొరవతో గ్రామాలు అభివృద్ధిలో ముందుకు సాగుతున్నాయని సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పుల్లూరులో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ శ్రీదేవి చందర్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎక్కడా మట్టి రోడ్లు లేకుండా సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ నరేశ్, ఉపసర్పంచ్ ప్రసాద్, వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

జిల్లా యాదవ యువత అధ్యక్షుడిగా 'బొల్లు'



నియామకపత్రం అందుకుంటున్న బొల్లు రాము యాదవ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అఖిల భారత యాదవ యువ మహాసభ జిల్లా అధ్యక్షుడిగా సిద్దిపేట పట్టణానికి చెందిన బొల్లు రాము యాదవ్‌ను నియమించారు. ఈమేరకు శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్ర యువత అధ్యక్షుడు ఐలబోయిన రమేష్ యాదవ్ నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బద్దుల బాబురావు, జాతీయ ప్రధాన కార్యదర్శి రాజబోయిన లక్ష్మణ్ యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేకల రాజేందర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి పోచబోయిన శ్రీహరి యాదవ్, జిల్లా అధ్యక్షుడు మామిండ్ల ఐలయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

హుస్నాబాద్: ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను విచ్చలవిడిగా వసూలు చేస్తూ దోపిడీకి గురిచేస్తున్నారని ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ అయిలేని మల్లికార్జున్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశాడు.

విద్యార్థులు చదువులో రాణించాలి

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని లయన్స్ క్లబ్ ఆఫ్ గజ్వేల్ స్నేహ అధ్యక్షుడు సయ్యద్ మతిన్ అన్నారు. మండల పరిధిలోని బెజుగామలో శుక్రవారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ బుక్స్, స్టడీ మెటీరియల్, స్టేషనరీని అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు నేతి శ్రీనివాస్, దొంతుల సత్యనారాయణ, ఎల్లం రాజు, అజయ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని మహంకాళమ్మ తల్లి దేవాలయంలో ఆషాడ బోనాల ఉత్సవాల్లో భాగంగా ఆది వారం వరకు మూడ్రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. మొదటి రోజు శుక్రవారం మహా గణపతి పూజ, మానసాదేవికి ప్రత్యేక అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమం

కొండపాక(గజ్వేల్): కాంగ్రెస్‌తోనే సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు విరుపాక్ష శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి బీఆర్ఎస్ నుంచి 100 మంది కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరగా వారిని నర్సారెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం గ్రామ పార్టీ అధ్యక్షుడిగా బోడపట్ల ఐలయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సాధుపల్లి పవన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొంతం కరుణాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నికున్నారు.

ఉద్యోగ విరమణ సహజం



ఉద్యోగులను సత్కరిస్తున్న డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి

దుబ్బాక: ప్రతీ ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ సహజమని దుబ్బాక ఇన్‌చార్జి డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి అన్నారు. దుబ్బాక బస్ డిపోలో విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మల్లగౌడ్, ఏడీసీ మహ్మద్ మజర్ అలీ, కండక్టర్ టీఎస్ చారీ, యాదగిరిగౌడ్‌ను సత్కరించి మెమెంటోలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీకి తమ అమూల్యమైన సేవలు అందించినందుకు గానూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వచ్చేది బీజేపీ ప్రభుత్వమే

హుస్నాబాద్: పట్టణంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు ఆధ్వర్యంలో 6, 19, 20 బూత్‌స్థాయి కార్యకర్తలతో మేరా బూత్ సబ్ సే మజ్ బూత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి అల్పకాలిక విస్తారక్ సబేఇంద్రన్ హాజరై మాట్లాడారు. ప్రతి కార్యకర్త సైనికుడిగా పని చేసి బీజేపీ పార్టీ అధికారంలోకి వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు మెంబర్ లక్కిరెడ్డి తిరుమల, బీజేపీ జిల్లా కోశాధికారి దొడ్డి శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి విద్యాసాగర్, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి స్వరూప, నాయకులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

పథకాలపై ఇంటింటి ప్రచారం

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని మర్పడ్గలో శక్తి కేంద్ర ఇంచార్జి బాశమైన ప్రశాంత్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో స్వల్పకాలిక విస్తారక్ దేవరాజ్, సోషల్ మీడియా కన్వీనర్ తాళ్లపల్లి ప్రవీణ్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ చేయాలి

బెజ్జంకి(సిద్దిపేట): సీఎం కేసీఆర్ రైతులకు పంట రుణాల మాఫీని వెంటనే అమలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు దోనె అశోక్ డిమాండ్ చేశారు. మండలంలోని బేగంపేటలో శుక్రవారం మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు.

చదువుతో పాటు సంస్కృతి నేర్చుకోవాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థులు చిన్ననాటి నుంచే చదువుతో పాటు సంస్కృతి, సంప్రదాయాలను నేర్చుకోవాలని ట్రస్మా స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గ మల్లారెడ్డి సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కాకతీయ ఈ–టెక్నో హైస్కూల్‌లో 'ఆషాడ మాసం.. గోరింటాకు సంబురం' పేరిట సంబురాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గోరింటాకు ఆరోగ్యానికి మేలు చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం విజయవంతం

వర్గల్(గజ్వేల్): మండల పరిధిలోని మజీద్‌పల్లిలో శుక్రవారం మెడిసిటి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. సర్పంచ్ బబ్బూరి లత శివరాములు శిబిరాన్ని ప్రారంభించగా డాక్టర్లు సుశీల్, శ్రద్ధ గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట భూంపల్లి మండలంలోని ఎమ్మెల్యే రఘునందన్ రావు బొప్పాపూర్ ఎల్లమ్మ దేవాలయం నుంచి ఆకారం వాటర్ ట్యాంక్ వరకు సొంత ఖర్చులతో రోడ్డు వేయిస్తుండగా.. శుక్రవారం సర్పంచ్ బాలమణి మల్లయ్య పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.